

జిల్లావ్యాప్తంగా
కుండపోత

● సదుంలో 126.2 మి.మీ వర్షపాతం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి శనివారం ఉదయం 11 గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. అత్యధికంగా సదుం మండలంలో 126.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా నగరిలో 17.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో ... పెద్దపంజాణిలో 108.2 మి.మీ, పలమనేరులో 102.2, గంగవరంలో 99.4, పూతలపట్టులో 96.4, యాదమరిలో 90.4, బంగారుపాళ్యంలో 88.4, పెనుమూరులో 86.8, జీడీనెల్లూరులో 82.6, తవణంపల్లెలో 82.4, చిత్తూరు అర్బన్‌లో 81, ఎస్ఆర్‌పురంలో 72.4, సోమలలో 70.4, పులిచెర్లలో 64.6, నింద్రలో 64.2, వి.కోటలో 58.4, పాలసముద్రంలో 56.4, రొంపిచెర్లలో 52.4, బైరెడ్డిపల్లెలో 51.2, గుడిపాలలో 42.8, గుడుపల్లెలో 42.4, చిత్తూరు రూరల్‌లో 41, రామకుప్పం, వెదురుకుప్పంలో 40.4, కుప్పంలో 30, పుంగనూరులో 28.4, శాంతిపురంలో 26.6, కార్వేటినగరంలో 23.4, ఐరాలలో 22.2, చౌడేపల్లెలో 20.2 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.



సోమల మండలం బసవపల్లె వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు

కృష్ణాపురం రిజర్వాయర్ గేటు ఎత్తివేత



వెదురుకుప్పం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్‌లో వరద నీటితో నీటి మట్టం పెరిగింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఒక గేటును ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.ఈఈ జి.మురళికుమార్, డీఈఈ వరప్రసాద రెడ్డి, ఏఈఈ పీఎస్ భాస్కర్ రాజీవ్ పాల్గొన్నారు.

జోరుగా సాగుతున్న గార్గేయ నది





జోరుగా ప్రవహిస్తున్న గార్గేయ నది - తుమ్మగుంటపల్లెలో ఓ ఇంటిపై ఒరిగిన విద్యుత్ స్తంభం

సదుం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):సదుం మండల పరిధిలో శుక్రవారం రాత్రి నుంచి ఉదయం వరకు ఎడతెరపి లేని వర్షం కురిసింది. దీంతోపాటు ఎగువ ప్రాంతాలైన సోమల, చౌడేపల్లె మండలాల్లో భారీ వర్షం కురవడంతో కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టు మొరవపోతూ గార్గేయ నదిలోకి నీరు చేరుతోంది. దీంతో గార్గేయ నది జోరుగా సాగుతోంది.వర్షంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తుమ్మగుంటపల్లెలో ఓ ఇంటిపై నేలకొరిగిన విద్యుత్ స్తంభంతో పెద్దప్రమాదం తృటిలో తప్పింది. భారీ వర్షాల నేపథ్యంలో పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ సూచించారు.తడిసిన కరెంటు స్తంభాలను ముట్టుకోకూడదని, తడిసిన చేతులతో స్టార్టర్లు, మోటర్లు ముట్టుకోరాదని, ఉతికిన బట్టలు ఇనుక కమ్మీలపై వేయకూడదని, ఉరుములు, మెరుపుల సమయంలో ముందస్తుగా టీవీలు, ఫ్రిజ్‌లు ఆఫ్ చేసి పెట్టుకోవాలని సూచించారు.

సోమలలో భారీ వర్షం

● కొట్టుకుపోయిన కల్వర్టులు
● పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు



దేవళకుప్పం మార్గంలో రోడ్డుపై జలప్రవాహం

సోమల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. మూడు చోట్ల కల్వర్టులు కొట్టుకుపోయాయి. ఏడు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. గార్గేయ నది ప్రవాహవేగం పుంజుకుంది. పెద్దఉప్పరపల్లె నుంచి రెడ్డివారిపల్లె మార్గంలో గార్గేయ నదిపై నిర్మించిన తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయింది. పెద్దఉప్పరపల్లె నుంచి పేటూరు, బసవపల్లె, పొలికిమాకులపల్లె, ఎర్రగుంతలపల్లె, బోనమంద, చిన్నకమ్మపల్లె, దుర్గంకొండ గ్రామాల మార్గంలో పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీ వద్ద కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. పలు ప్రాంతాల నుంచి వంకలు గార్గేయ నదిలో కలవడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో పలు గ్రామాల ప్రజలు పెద్దఉప్పరపల్లెకు వెళ్లలేకపోతున్నారు. పెద్దఉప్పరపల్లె నుంచి బసవపల్లె,పేటూరు, బూరగపల్లె, సరకల్లు, పెనుగొలకల, రాయలపేటమీదుగా పలమనేరు మార్గంలోనూ రాకపోకలు స్తంభించాయి. పెద్దఉప్పరపల్లె టు పలమనేరు బస్సును కూడా రద్దు చేశారు. అలాగే పెద్దఉప్పరపల్లె నుంచి చౌడేపల్లె మార్గంలో దేవళకుప్పం వద్ద సీతమ్మ చెరువుకు వచ్చే వంక ఉధృతితో బయ్యారెడ్డిపల్లె, మేకలచిన్నేపల్లె, దేవళకుప్పం, చిన్నదేవళకుప్పం గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. పెద్దఉప్పరపల్లె నుంచి రెడ్డివారిపల్లె, దుర్గంకొండ మార్గంలోని గార్గేయనది ఉధృతితో ఈ మార్గంలో ప్రయాణాలు స్తంభించాయి. సోమల - పెద్దఉప్పరపల్లె మార్గంలోని సీతమ్మచెరువు మొరవ వద్ద భారీ నీటి ప్రవాహంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ఆర్టీసీ బస్సులు కూడా ఆపేశారు. సోమల - నంజంపేట మార్గంలోని జీడిరేవుల వంక ఉధ్రుతితో తాత్కాలిక కల్వర్టు వద్ద మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమేశ్ నాయుడు ఎక్స్‌కవేటర్‌తో పనులు చేపట్టారు. గార్గేయనది, బసవపల్లె మార్గంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు పనులను పర్యవేక్షించారు. నంజంపేట వద్ద ఉన్న దళవాయి చెరువుకు వర్షపు నీరు చేరడంతో తాత్కాలికంగా వేసిన కల్వర్టు నీటిలో మునిగిపోయింది. గత ఏడాది అక్టోబరులో కురిసిన భారీ వర్షాలతో దళవాయి చెరువు మొరవ ఉధృతితో కట్ట తెగిపోయింది. దీంతో నంజంపేట నుంచి పొదలకుంటపల్లె, తుగడంవారిపల్లె, సి.వడ్డిపల్లె, సూరయ్యగారిపల్లె మార్గంలో రాకపోకలు ఆగిపోయాయి. ఈ మార్గంలో వచ్చే బస్సులు ఏడాదిగా రద్దు చేశారు. నంజంపేట - తుగడంవారిపల్లె, పొదలకుంటపల్లె మార్గంలో ప్రజల రాకపోకలకు చెరువులోనే తాత్కాలిక కల్వర్టు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఆ కల్వర్టు నీటమునిగింది.

పలు పంటలకు తీవ్ర నష్టం

వర్షంతో వేరుశనగ పంట కుళ్లిపోనుంది. తొలుత వర్షం లేక పంట నష్టం కాగా తర్వాత అంతో ఇంతో పండిన పంట వర్షం పాలైంది. భూమిలో ఉన్న వేరుశనగ పంట మొలకలెత్తుతుండగా, ఉబ్బడి కావాల్సిన వేరుశనగ కాయలు నల్లగా మారి బూజుపడుతున్నాయి.పలు మార్గాల్లో రాకపోకలు ఆగిపోవడంతో బొప్పాయి, టమోటా పంటను మార్కెట్‌కు తరలించడానికి వీలులేక రైతులు ఇబ్బంది పడుతున్నారు.శనివారం సోమల ఎస్ఐ శివశంకర సిబ్బందితో కలసి తెగిన కల్వర్టులను పరిశీలించి ఆ ప్రాంతంలోకి ప్రజలు వెళ్లకుండా పహరా చూస్తున్నారు. రైతులు పొలాల వద్దకు వెళ్లకుండా గార్గేయ నది వైపు రాకుండా చర్యలు తీసుకున్నారు.

ఆనందంలో ఆటోవాలా

జిల్లాలో 6777మందికి రూ.10.16 కోట్ల లబ్ధి

నియోజకవర్గ కేంద్రాల్లో ఘనంగా సమావేశాలు ● పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు,కూటమి నేతలు



సెల్‌ఫోన్‌లో నగదు జమైందని చూపిస్తున్న ఆటో డ్రైవర్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లసేవలో కార్యక్రమాన్ని శనివారం జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా నిర్వహించారు.జిల్లాలో ఆటోడ్రైవర్ల సేవలో పథకానికి అర్హులైన 6777మంది ఆటో డ్రైవర్లకు రూ.10.16కోట్లు ఆర్థికసాయం అందజేశారు. నియోజకవర్గాల వారీగా పూతలపట్టులో ఎమ్మెల్యే మురళీమోహన్, జీడీనెల్లూరులో ప్రభుత్వ విప్ థామస్, పుంగ నూరులో శాప్ చైర్మన్ రవి నాయుడు పాల్గొని ఆటో డ్రైవర్లకు నమూనా చెక్‌లు పంపిణీ చేశారు. పలమ నేరులో నిర్వహించిన ఆటో డ్రైవర్ల ర్యాలీలో డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర రెడ్డి పాల్గొనగా, కుప్పంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని నమూనా చెక్‌లు అందజేశారు. చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్, కలెక్టర్ సుమిత్ కుమార్ ఆటో డ్రైవర్లకు నమూనా చెక్ అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజల కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న పనులను అందరూ అర్థం చేసుకుని ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి వెళ్లినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన వారు లబ్ధిదారుల జాబితాలో లేకుంటే సమస్యను పరిష్కరించి అర్హుల జాబితాలో చేరుస్తామన్నారు.ఆటో డ్రైవర్లకు తక్కువ వడ్డీతో రుణాలివ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకుముందు వందలాది ఆటోలతో గాంధీ విగ్రహం నుంచి ఎంఎస్ఆర్ మీదుగా నాగయ్య కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సీఎంటీ త్యాగరాజన్ పాల్గొన్నారు.




లబ్ధిదారులకు నమూనా చెక్కు పంపిణీ

అంబేడ్కర్ విగ్రహ ఘటనలో వీడని మిస్టరీ



అంబేడ్కర్ విగ్రహం వద్ద బందోబస్తు

వెదురుకుప్పం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనలో మిస్టరీ ఇంకా వీడలేదు. ఈ ఘటనపై బొమ్మయ్యపల్లె గ్రామ కార్యదర్శి రాము ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.ఈ వ్యవహారం వెనుక కుట్ర, ఇతరత్రా కారణాలను లోతుగా విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది.అనుమానితులను పోలీసులు విచారిస్తున్నారు.విగ్రహం వద్ద ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.శుక్రవారం పార్టీల పరస్పర ఆరోపణలతో ఉద్రిక్తత నెలకొన్న నేపథ్యంలో శనివారం దేవళంపేటలో పోలీసు బలగాలు మొహరించారు. డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ సహా నలుగురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, నలభై మంది పోలీసులు దేవళంపేటకు చేరుకున్నారు.అంబేడ్కర్ విగ్రహం వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.



ఇస్కాన్‌కు బాంబు బెదిరింపు



ఇస్కాన్ ఆలయంలో బాంబు డిస్పోజల్ స్క్వాడ్ తనిఖీలు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని ఇస్కాన్ ఆలయంతోపాటు మరో రెండు ప్రాంతాల్లో ఆర్‌డీఎక్స్ బాంబు లు పెట్టామంటూ పోలీసులకు ఈ-మెయిల్స్ వచ్చాయి. తమిళనాడు రాష్ట్రం కరూర్ ఘటనను సీబీఐకి అప్పగించాలని అందులో పేర్కొంటూ డిప్యూటీ ఈవో డోనర్ సెల్.తిరుమల.ఓఆర్జీ పేరుతో, ఇస్కాన్ తిరుపతి పేరుతో మెయిల్స్ వచ్చాయి. శబరీష్ వేదమూర్తి పేరుతో మెయిల్ వచ్చింది. శుక్రవారం అర్ధరాత్రి 11 గంటల ప్రాంతంలో మెయిల్స్ రావడంతో అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ నాగార్జునరెడ్డి, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ అధికారి బీరయ్య, ఇతర సిబ్బంది కలసి ఇస్కాన్ ఆలయానికి చేరుకుని శనివారం తెల్లవారుజాము వరకు అక్కడున్న అతిథి గృహంతోపాటు ఆలయ పరిసరాలు, భక్తులు వేచి ఉండే గదులు, అన్నప్రసాదం క్యాంటీన్, గోశాల, భజనమందిరం, ఇతర ప్రాంతాల్లో నిశితంగా తనిఖీ చేశారు. తిరుపతి, తిరుమలలో భక్తులు తిరిగే ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బాంబుల జాడ కనిపించకపోవడంతో అవి ఫేక్ మెయిల్స్‌గా నిర్ధారించారు.

విద్యాశాఖలో అంతర్ జిల్లాల బదిలీ కౌన్సెలింగ్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో అంతర్ జిల్లాల బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, హెచ్ఎంలు, ఎంఈవోల స్థాయికి సంబంధించి మొత్తం 32 మంది అంతర్ జిల్లాల బదిలీలకు అర్హత సాధించారు. వీరిలో ఎంఈవో స్థాయి వారికి కడప ఆర్జేడీ బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించగా, మిగిలిన 30 మందికి జిల్లా కేంద్రంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మధ్యాహ్నం ప్రారంభమైన కౌన్సెలింగ్ ప్రక్రియ రాత్రి 8.30 గంటల వరకు సాగింది. విద్యాశాఖ ఏడీలు, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కొత్త ఉపాధ్యాయులకు చిత్తూరు, తిరుపతిలోని ఆరు కేంద్రాల్లో శిక్షణ తరగతులు శనివారం సైతం కొనసాగాయి. ఈనెల 10న శిక్షణ తరగతులు ముగియనున్న క్రమంలో మ్యాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వనున్నారు. ఈ క్రమంలో విద్యాశాఖ అధికారులు తగిన ఖాళీలు గుర్తించాల్సి ఉంది. ఇదిలా ఉండగా శిక్షణ సమయంలోనే కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయుల నుంచి ఏ ప్రాంతాల్లో పనిచేయాలని భావిస్తున్నారనే దానిపై ఆప్షన్ తీసుకుంటారని సమాచారం.

ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

చిత్తూరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ (జడ్పీ) పరిధిలో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల (ఏవో)గా పదోన్నతి కల్పించి, వారికి స్థానాలను కేటాయిస్తూ శనివారం సీఈవో రవికుమార్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. చౌడేపల్లె ఎంపీడీవో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ సుకన్యను సదుం ఎంపీడీవో కార్యాలయ ఏవోగా, పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ శాంతిని పాకాల ఎంపీడీవో కార్యాలయ ఏవోగా, జడ్పీలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డిని రామచంద్రాపురం ఎంపీడీవో కార్యాలయ ఏవోగా నియమించారు.

వైసీపీ నిరసన



అంబేడ్కర్ విగ్రహం ఎదుట రోడ్డుపై బైఠాయించిన వైసీపీ నాయకులు

వెదురుకుప్పం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన ఘటనపై దళితజాతికి సీఎం చంద్రబాబు క్షమాపణ చెప్పాల్సిందేనని ఉమ్మడి జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వెదురుకుప్పం మండలం దేవళంపేటలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఉన్న వెదురుకుప్పం-కొత్తపల్లిమిట్ట రహదారిపై తిరుపతి ఎంపీ గురుమూర్తి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ మంత్రి నారాయణస్వామి, చిత్తూరు, జీడీనెల్లూరు వైసీపీ ఇన్చార్జిలు ఎంసీ విజయానందరెడ్డి, కృపాలక్ష్మి, పార్టీ శ్రేణులతో కలిసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కరుణాకర రెడ్డి మాట్లాడుతూ.. దోషులను వదిలిపెట్టి బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్యను నిర్బంధించడం ఏంటని ప్రశ్నించారు. విగ్రహ దాత అయిన గోవిందయ్యను వెంటనే విడుదల చేయాలన్నారు. మాజీ ఎంపీపీ మేలిపాటి పురుషోత్తం, నాయకులు తులసి, మునిరాజ, నాగరాజురెడ్డి, శేషాచలపతి, ఉమాపతి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన 'కలిగిరి కొండ'



స్వామి, అమ్మవార్లు - ట్రాఫిక్ జామ్

పెనుమూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పెనుమూరు మండలంలోని కలిగిరి కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఏటా పెరటాసి నెల ఐదు శనివారాలు ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. మూడోవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో కొండపైకి వచ్చి శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం గోవిందనామస్మరణలతో మార్మోగింది. ప్రధాన అర్చకుడు వాసుదేవాచార్యులు, ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్‌లు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సాయంత్రమయ్యేసరికి వాహనాలు, భక్తుల రద్దీ కారణంగా రోడ్డు బ్లాక్ అయింది. సుమారు రెండు గంటల ట్రాఫిక్ జామ్‌తో భక్తులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

ఆరుగురు గంజాయి విక్రేతల అరెస్టు

● పరారీలో ప్రధాన నిందితుడు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

బంగారుపాళ్యం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం మధ్యాహ్నం అరగొండ ఫ్లైఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకుని విచారించారు. పొంతలేని సమాధానాలు చెప్పడంతో తనిఖీ చేయగా వారివద్ద రెండు కిలోల గంజాయి బయటపడింది. నిందితులు.. చిత్తూరు ఇరువారంకు చెందిన అల్లాబక్ష వద్ద నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, గ్రామాల్లో వాటిని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం నిందితులైన తవణంపల్లె మండలం గోవిందరెడ్డిపల్లెకి చెందిన మాధవ, ఈచనేరికి చెందిన జీవ, ఐరాల మండలం గుండ్లపల్లె ఎస్టీ కాలనీకి చెందిన నరసింహులు, బంగారుపాళ్యం మండలం టి.మిట్టూరుకు చెందిన విఘ్నేష్, సదకుప్పం గ్రామానికి చెందిన హరీష్, నల్లంగాడుకు చెందిన కభీలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడు అల్లాబక్ష పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ బాబు, ఎస్ఐ ప్రసాద్, వీఆర్వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డిటోనేటర్లు స్వాధీనం.. కేసు నమోదు

పుంగనూరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలోని భీమగానిపల్లె వద్ద 6 డిటోనేటర్లు, 6 పవర్‌జల్లులను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పుగనూరులో వాహనాలు తనిఖీ చేస్తుండగా మదనపల్లె రంగారెడ్డికాలనీకి చెందిన గంగాధర్, పుంగనూరు మండలం ఆరడిగుంట గ్రామానికి చెందిన మణి మినీ ట్రాక్టర్‌లో 6 డిటోనేటర్లు, 6 పవర్‌జల్లులను (పేలుడు పదార్థాలు) తీసుకెళుతూ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 26వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 184, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,644మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 1.996మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,489మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,099, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 367మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 289మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 83మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు 20,601 అమ్ముడైనట్లు అధికారులు వెల్లడించారు.

రాజకీయ స్వార్థ ప్రయోజనాలకు

అంబేడ్కర్‌ను వాడుకోవద్దు

● టీడీపీ నేతల సూచన



అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు

వెదురుకుప్పం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):అంబేడ్కర్‌ను రాజకీయ స్వార్థ ప్రయోజనాలకు వాడుకోవద్దంటూ వైసీపీ నేతలకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు. శనివారం చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, పార్టీ శ్రేణులతో కలసి వెదురుకుప్పం మండలం దేవళంపేటకు ఎంపీ, ఎమ్మెల్యే వచ్చారు. ముందుగా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తర్వాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్ అంతటి మహోన్నత వ్యక్తి విగ్రహానికి నిప్పు పెట్టడం దురదృష్టకరమన్నారు. జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ వెంటనే స్పందించి కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమాజంలో సామరస్యతను దెబ్బతీయడానికి కొందరు చేస్తున్న కుట్రను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పోలీసు శాఖ కూడా తీవ్రంగా పరిగణించాలని, నిందితులను కఠినంగా శిక్షించి, ఇటువంటివి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఆర్ రాజన్ మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవడం వైసీపీ వారి దిగజారుడు రాజకీయలకు నిదర్శనమని దుయ్యబట్టారు. వైసీపీ వ్యూహం ఫలించలేదని, ఈ విషయాలన్నీ ప్రజలకు తెలుసునన్నారు. రాబోయే రోజుల్లో వైసీపీ నేతలకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మాజీ ఎంపీపీ ఇందిర, క్లస్టర్ ఇన్చార్జిలు పి.మోహన్‌మురళి, కోనేరు చెంగల్రాయరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, పీఏసీఎస్ చైర్మన్ బోడిరెడ్డి సుధాకరరెడ్డి, నాయకులు సాతల గుణశేఖర్, నేసనూరు మునిచంద్రారెడ్డి, పైడి మనోహర్‌నాయుడు, వి.నాగరాజురెడ్డి, శ్రీరాములునాయుడు, చొక్కా మహేష్, రావిళ్ల వెంకటాద్రినాయుడు, బుజ్జిబాబు, విజయనరసింహారెడ్డి, కామసాని దామోదరరెడ్డి, చిన్నమరెడ్డి, క్రాంతికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జ్వర పీడితులకు రక్త పరీక్షలు తప్పనిసరి

● డీఎంహెచ్‌వో సుధారాణి



ఐఈసీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి తదితరులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీకి వచ్చే అన్నిరకాల జ్వర పీడితులకు రక్త పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ల్యాబ్ టెక్నీషియన్లను డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లినప్పుడు జ్వరాల కేసులన్నింటికీ ఆర్డీటీ కిట్ ద్వారా రక్తపరీక్షలు చేసి.. పాజిటివ్ వస్తే పీహెచ్‌సీలకు తరలించి చికిత్స అందించాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు రోజూ రక్త పరీక్షలకు సంబంధించిన సేవలను ఎల్‌ఫార్మ్‌లో అప్డేట్ చేయాలని సూచించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. అనుమానిత కేసులకు గల్ల పరీక్ష చేసి.. టీబీ పాజిటివ్ వస్తే వెంటనే చికిత్స ప్రారంభించాలన్నారు. డీఎంవో వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రతి ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. విచ్చలవిడి సెక్స్ ద్వారా సంక్రమించే వ్యాధులపై ఐఈసీ మెటీరియల్‌ను అధికారులు ఆవిష్కరించి.. ల్యాబ్ టెక్నీషియన్లకు పంపిణీ చేశారు. డీఐవో హనుమంతరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారులకు

టైమ్ బౌండ్ ప్రమోషన్లు కల్పించాలి

● డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా



నల్లబ్యాడ్జీలతో ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యాధికారులకు టైమ్ బౌండ్ ప్రమోషన్లు కల్పించాలని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ నల్లబ్యాడ్జీలతో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పీహెచ్‌సీ వైద్యాధికారులకు 25 ఏళ్లుగా టైమ్ బౌండ్ ప్రమోషన్లు లభించకపోవడం బాధాకరమన్నారు. గతంలో 30 శాతం ఉన్న ఇన్‌సర్వీస్ పీజీ కోటాను ఇప్పుడు జీవో 99 ద్వారా కేవలం 15శాతానికి తగ్గించారన్నారు. అది కూడా ఆరు విభాగాలకు మాత్రమే పరిమితం చేయడం దారుణమన్నారు. కేరళలో 50, కర్ణాటకలో 40, తమిళనాడులో 30 శాతం ఇన్‌సర్వీస్ కోటా పీజీ సీట్లు మంజూరు చేస్తున్నప్పుడు ఏపీలో మాత్రం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగాపెట్టి పనిచేస్తే ప్రతిఫలంగా ప్రభుత్వం తమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వాపోయారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శిరీషా, వైద్యాధికారులు సురేఖ, జయసింహ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ఆగని గజ దాడులు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట - మామిడిచెట్లు

కల్లూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజ దాడులు ఆగడం లేదు. ఏదో ఒక ప్రాంతంలో రాత్రి వేళల్లో పంటలపై ఏనుగుల గుంపు దాడులు చేయడం పరిపాటిగా సాగుతోంది. వరి, టమోటా, అరటి, కొబ్బరి, మామిడి పంటలకు అపారనష్టం వాటిల్లుతోంది. శుక్రవారం రాత్రి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం నుంచి బయలుదేరిన సుమారు 10 ఏనుగుల గుంపు కల్లూరు ఘాట్‌రోడ్డు సమీపంలోని రిలయన్స్ టవర్ దగ్గరకు చేరుకున్నాయి. రైతులు పీరాసాబ్, షాజహాన్, మౌలానా అహ్మద్, సయ్యద్‌బాషా, ఇక్బాల్‌కు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు కర్నూలు-చిత్తూరు హైవే రోడ్డును దాటుకొని పాళెం పంచాయతీలోకి అడుగుపెట్టాయి. రైతులు హరినాధనాయుడు, భాస్కర్‌నాయుడు, సయ్యద్‌బాషాలకు చెందిన వరి, మామిడి, పశుగ్రాసంలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి కోటపల్లి ఓవర్ హెడ్ ట్యాంకు వద్దకు చేరుకొని ఘీంకారం చేసిన ఏనుగులు మురళీ, దామోదర్, కళావతమ్మకు చెందిన మామిడి, పశుగ్రాసంను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి తూర్పు విభాగం అటవివైపు అడుగులు వేసిన ఏనుగుల గుంపు మార్గంలోని పలువురు రైతుల మామిడిచెట్లను ధ్వంసం చేసుకుంటూ అడవిలోకి చేరుకున్నాయి. శనివారం పగలంతా చింతలవంక సమీపంలోని సూరప్పచెరువు వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు ప్రజలు తెలిపారు.



గజదాడుల్లో ధ్వంసమైన వరి పంట

వరిపొలాలపై ఏనుగుల దాడి

పలమనేరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం మొసలిమడుగు గ్రామ పొలిమేరల్లోని శుక్రవారం రాత్రి ఒంటరి ఏనుగు దాడులతో పలువురి రైతులకు చెందిన వరి పంట నష్టం జరిగింది. పంటలను తొక్కుకుంటూ అడవిలోకి వెళ్లింది.

జాతీయ సహకార వర్క్‌షాప్‌కు

పకడ్బందీగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాజ్‌హోటల్ వేదికగా ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సహకార వర్క్‌షాప్‌నకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, ఎలాంటి లోటుపాట్లకూ తావులేకుండా చూడాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం ఆయన సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. సహకార మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలపై ఇందులో సమీక్షించనున్నట్లు తెలిపారు. జాతీయ సహకార మంత్రిత్వ శాఖ సెక్రటరీ ఆశీష్‌కుమార్ బుటాని, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సంయుక్త కార్యదర్శి సిద్ధార్థ్‌జైన్, అగ్రికల్చర్ అండ్ సెరికల్చర్ కోఆపరేషన్, మార్కెటింగ్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, సహకార కమిషనర్ బాబు, సహకార శాఖ కార్యదర్శుల తోపాటు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సహకార శాఖ సీనియర్ అధికారులు, ప్రతినిధులు హాజరవుతారన్నారు. అతిథులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, కోఆపరేటివ్ అధికారిణి లక్ష్మి పాల్గొన్నారు.


తిరుపతిలో చైన్‌స్నాచర్ల హల్‌చల్

● ఐదుగురు మహిళల నగలను లాక్కెళ్లిన వైనం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం సాయంత్రం చైన్ స్నాచింగ్ ముఠా చెలరేగింది. ఇద్దరు అగంతకులు ముసుగులు ధరించి మహిళల మెడల్లో బంగారు గొలుసులు దోపిడీ చేశారు. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో తిమ్మినాయుడుపాళెం సమీపంలో కాపురమున్న నాగభూషణమ్మ మంగళం రోడ్డులో వెళుతుండగా గరుడాద్రినగర్ వద్ద బైక్‌లో వచ్చిన ముసుగు దొంగలు ఆమె మెడలో వున్న 48 గ్రాముల బంగారు చైను లాక్కొని పరారయ్యారు. ● అలిపిరి పరిధిలోని గొల్లవానిగుంట వద్ద సరస్వతమ్మ ఇంటి ముందు కూర్చుని వుండగా ఆమె మెడలోని 50 గ్రాముల బంగారు చైన్లు రెండు లాక్కొని పారిపోయారు. ● ఉపాధ్యాయ నగర్‌కు చెందిన రాధ ఇంటి ముందు వాకింగ్ చేస్తుండగా ఆమె మెడలోని 38 గ్రాముల చైను లాక్కొని పరారయ్యారు. ●మంగళం రోడ్డులోని గంగారాం ఫంక్షన్ హాలు వద్ద రోడ్డుపై నిలుచుని ఉన్న మంజుల మెడలోని 26 గ్రాముల చైను లాక్కొని ఉడాయించారు. ● పోస్టల్ కాలనీకి చెందిన కె.జయశ్రీ ఇంటికి నడుచుకుని వెళుతుండగా ద్విచక్ర వాహనంపై వెళ్లి ఆమె మెడలోని 52 గ్రాముల మూడు బంగారు చైన్లు లాక్కొని వెళ్లిపోయారు. నిందితులు 30 నుంచి 40 సంవత్సరాల వయస్సున్న యువకులుగా ఉన్నారని, సీసీ ఫుటేజీ ఆధారంగా వారిని గుర్తించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని డీఎస్పీ భక్తవత్సలం తెలియజేశారు. రేపటిలోగా నిందితులను పట్టుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు.

వడమాలపేటలో 87.4 మి.మీ వర్షపాతం

● తిరుపతిలో నీట మునిగిన రైల్వే అండర్ పాస్‌లు



తిరుపతిలో కపిలతీర్థం నుంచి జాలువారుతున్న జలపాతం

తిరుపతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లావ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షాలు కురిశాయి. మొత్తం 34 మండలాలకు గానూ 27 మండలాల్లో వర్షాలు పడ్డాయి. అత్యధికంగా వడమాలపేట మండలంలో 87.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సగటున 31.8 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. దాదాపుగా అన్ని మండలాల్లోనూ శనివారం వేకువ జామున మొదలైన వర్షాలు ఉదయం 10 గంటల వరకూ కురిశాయి. శ్రీకాళహస్తిలో వర్ష తీవ్రతకు పాఠశాలలకు సెలవు ప్రకటించారు.తిరుపతిలో వేకువ జాము నుంచీ ఉదయం 9 గంటల వరకూ మోస్తరు వాన కురిసింది. ఈస్ట్ పోలీస్ స్టేషన్ పక్కనున్న రైల్వే అండర్ పాస్, అలాగే వెస్ట్ చర్చి సమీపంలోని రైల్వే అండర్ పాస్‌లు నీట మునిగి వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. లక్ష్మీపురం కూడలి నుంచీ ఎయిర్ బైపాస్ రోడ్డు వరకూ రోడ్డు జలమయమైంది. అశోక్‌నగర్, అబ్బన్న కాలనీ వీధులు చెరువులను తలపించాయి. ఆ ప్రాంతాల్లో ఇళ్ళలోకి నీరు చేరింది. రేణిగుంట శనివారం తెల్లవారుజామున 2.30 నుంచీ ఉదయం 11 వరకూ వర్షం కురిసింది. దానికి తోడు తిరుపతి నుంచీ వచ్చి పడిన వర్షపు నీరు తోడు కావడంతో వెంకటాపురం, అన్నాస్వామి పల్లి, కరకంబాడి, మాదివానికుంట చెరువులు నిండి కలుజులు పారాయి. నారాయణవనంలో కురిసిన వానలకు అరుణానది కల్వర్టులపై పొంగి ప్రవహించింది. పలుగ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. పుత్తూరు మండలం మూలనకోనలో వర్షపు తీవ్రతకు ప్రవాహ ఉధృతి పెరిగింది. దీంతో అటవీ శాఖ అధికారులు చెక్‌పోస్టు మూసివేసి రాకపోకలు నిలిపివేశారు.

తిరుమలలోనూ జోరు వర్షం



శ్రీవారి ఆలయం ముందు దంచికొడుతున్న వర్షం

తిరుమల (ఆంధ్ర జ్యోతి): తిరుమలలోనూ శనివారం వర్షం జోరుగా కురిసింది. వేకువజాము 5 నుంచి ఉదయం 8 గంటల వరకు భారీగా పడింది. శ్రీవారి దర్శనానికి వెళ్లే వారితోపాటు ముగించుకుని వెలుపలకు వచ్చిన భక్తులు వర్షంలో తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. పెరటాసి మాసం మూడో శనివారం కావడంతో తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. దర్శనం కోసం బాటగంగమ్మ సర్కిల్ సమీపంలోని క్యూలోకి ప్రవేశించే క్రమంలో భక్తులు తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. శ్రీవారిమెట్టు కాలినడక మార్గంలో వర్షపు నీరు జోరుగా ప్రవహించింది. మార్గం మధ్యలోని పక్కనే ఉన్న కాలువ ద్వారా వర్షపు నీరు వేగంగా ప్రవహిస్తూ మెట్లపైకి రావడంతో కాలినడక భక్తులు ఇబ్బందిపడ్డారు. ఉదయం 9 గంటల తర్వాత వర్షం పూర్తిగా నిలిచిపోవడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, తిరుమలలో చలి వాతావరణం పెరిగింది.

స్వచ్ఛ శాంతిపురమే లక్ష్యంగా పనిచేస్తున్నాం

● ఎంపీడీవో ఏపీఆర్ కుమార్



శాంతిపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ శాంతిపురమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నామని... శాంతిపురం మండలంలో చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ప్రధానమని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని కెనమాకులపల్లె పంచాయతీ రాష్ట్ర స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపిక కావడం సంతోషకరమని... పంచాయతీలోని సచివాలయ సిబ్బందితోపాటు ప్రజల సహకారంతో సాధ్యమైందన్నారు. ఈనెల 6వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి రూ.3 లక్షలు విలువైన ఎలక్ట్రికల్ ఆటోలు మంజూరు చేశామన్నారు. గ్రామాల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలను రూ.10 లక్షల జడ్పీ, గ్రామ పంచాయతీ నిధులతో మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చామని.. తడి, పొడి చెత్తలను సేకరించి సేంద్రియ ఎరువుల తయారీ చేపడుతున్నామని.. వచ్చేనెల 14 నుంచి రైతులకు విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



స్వామివారికి కల్యాణోత్సవం జరిపిస్తున్న పురోహితులు

కుప్పం రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల పరిధిలోని బేటరాయ కొండపై వెలసిన బేటరాయస్వామివారి ఆలయంలో శనివారం శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం బేటరాయస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణం జరిపించారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

చెరువులకు జలకళ..!

● చేరుతున్న కృష్ణాజలాలు ● ఆనందం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



రామకుప్పం : మణీంద్రం చెరువుకు చేరిన కృష్ణా జలాలు



చింతకుప్పం జిల్లాని చెరువుకు చేరుతున్న కృష్ణాజలాలు



వి.కోట: హంద్రీ-నీవా జలాలతో నిండిన రాయప్ప చెరువు



వి.కోట: నిండిన పాత్రపల్లి చెరువు

రామకుప్పం, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): వర్షాలు దోబూచులాడుకుంటున్న తరుణంలో హంద్రీ-నీవా కాలువ నుంచి కృష్ణాజలాలు రావడంతో రామకుప్పం మండలంలోని రైతుల్లో సంతోషం కనబడుతోంది. నెలరోజుల క్రితమే మండల పరిధిలోని అటవీ సమీప గ్రామాల్లో భారీ వర్షాలు కురవడంతో చెరువులు, కుంటల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో నీరు చేరాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలకు వాటిలో మరింత నీరు వచ్చాయి. తపలు చెరువులు మొరవలు పోయాయి. అయితే రామకుప్పం, బైపరెడ్లపల్లె, చెల్దిగానిపల్లె, మణీంద్రం, కెంచనబల్ల, విజలాపురం, బందార్లపల్లె పంచాయతీల్లో వానలు తక్కువగా కురిశాయి. దీంతో చెరువులు, కుంటలు జలాలు లేక కళావిహీనంగా మారాయి. హంద్రీ-నీవా కాలువ పుణ్యమా అని ఈ ప్రాంతంలో కొన్ని చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. హంద్రీ-నీవా కాలువ నుంచి వచ్చిన కృష్ణాజలాలతో అత్తికుప్పం వీరాశిచెరువు నిండి మొరవ ప్రవహిస్తోంది. మొరవ ప్రవాహంతో జలాలు మండలంలోని పెద్దచెరువుల్లో ఒకటైన మణీంద్రం చెరువుకు చేరాయి. అలాగే చింతకుప్పం జిల్లానిచెరువు, బైపరెడ్లపల్లె చెరువులకు కృష్ణాజలాలు చేరుకున్నాయి. మణీంద్రం చెరువు, జిల్లాని చెరువులు నిండి మొరవ ప్రవహిస్తే మరో పెద్దచెరువైన కెంచనబల్ల తోట్లచెరువుకు జలాలు చేరుకుంటాయి. ఇప్పటికయితే కెంచనబల్ల పంచాయతీలో ఆ ఒక్క చెరువుకు మాత్రమే హంద్రీ-నీవా జలాలు చేరుకునే అవకాశం ఉంది. అలాగే బైపరెడ్లపల్లె చెరువు నిండి మొరవ ప్రవహిస్తే చెల్దిగానిపల్లె చెరువుకు జలాలు చేరుకుంటాయి. అయితే రామకుప్పం, బందార్లపల్లె, విజలాపురం, ఉన్సిగానిపల్లె, కెంచనబల్ల, బల్ల, కొంగనపల్లె పంచాయతీల్లోని చెరువులకు ప్రస్తుతానికి హంద్రీ-నీవా కాలువ ద్వారా జలాలు వచ్చే అవకాశం లేదు. ప్రధాన కాలువ నుంచి ఉపకాలువలు ఏర్పాటు చేస్తేనే ఆ పంచాయతీల్లో చెరువులు జలకళను సంతరించుకుంటాయి. ప్రభుత్వం స్పందించి త్వరిత గతిన రామకుప్పం మండలంలో హంద్రీ-నీవా ప్రధాన కాలువ నుంచి ఉపకాలువలు ఏర్పాటు చేయాలని... అన్ని చెరువులకు కృష్ణాజలాలు చేరేలా చూడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మొరవపోతున్న పైపల్లె రాయప్ప చెరువు

వి.కోట: హంద్రీ-నీవా జలాల రాకతో వి.కోట మండల పరిధిలో చెరువులకు జలకళ సంతరించుకుంటోంది. గత మూడువారాలుగా ఆదినేపల్లె లిఫ్ట్ హౌస్‌కు ఎగువనున్న పలు చెరువులు ఇప్పటికే పూర్తి స్థాయిలో నిండి మొరవలు ప్రవహిస్తున్నాయి. తాజాగా నెర్నపల్లె పంచాయతీ పైపల్లె రాయప్ప చెరువు నిండు కుండలా పరవళ్లు తొక్కుతోంది. గత వారం ఈ చెరువు నుంచి మొరవ ప్రవహించి గంగమ్మ ఏరువైపు పరుగులు తీసింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కృష్ణా జలాలకు జలహారతులు ఇచ్చారు. అలాగే వి.కోటకు ఎగువ వైపున ఉన్న ముదిమడుగు, పత్రపల్లె చెరువులకు నీరు చేరుతోంది. ఈ రెండు చెరువులు నిండితే వాటి నుండి నీరు దిగువనున్న కీలపల్లె చెరువుకు చేరుకుంటాయి. దాసార్లపల్లె చెరువు నుండి ఇప్పటికే వి.కోట కీలపల్లె చెరువుకు నీరు చేరుతోంది. మొత్తానికి హంద్రీ-నీవా జాలల రాకతో ఓ వైపు కాలువ ద్వారా నీటి ప్రవాహం జరుగుతుండగా.. మరో వైపు వి.కోట మండలంలో చెరువులకు నీరు చేరుతుండటంతో చెరువులో జలకళ సంతరించుకోవడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● వి.కోట పట్టణానికి అనుకునే ఉన్న పత్రపల్లె చెరువు కృష్ణా జలాలతో నిండు కుండలా పరవళ్లు తొక్కుతోంది. గత నెల రోజులుగా హంద్రీ-నీవా కాలువ నుంచి పలు దఫాలుగా పత్రపల్లె చెరువుకు నీటిని విడుదల చేయడంతో చెరువు పూర్తిగా నిండి దిగువకు మొరవ ప్రవహించింది. ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. హంద్రీ-నీవా జలాలతో మండలంలో ఇప్పటికే పెద్దబరిణేపల్లె వెంగన్న చెరువు, కరిపల్లె దిగువ చెరువు, ఆదినేపల్లె గంగమారక్క చెరుకు, దాసార్లపల్లె చెరువు, పైపల్లె రాయప్ప చెరువు, కొత్తూరు చెరువు, మిట్టూరు చెరువు, చల్లపల్లె చెరువు, చిన్నశ్యామ చెరువు, నాగిరెడ్డిపల్లె చెరువులు నిండి మొరవలు ప్రవహిస్తున్నాయి. ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కష్టజీవులకు అండగా చంద్రన్న



కుప్పంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీఎస్ఎం తదితరులు



పుంగనూరులో ఆటోడ్రైవర్లకు చెక్కులు పంపిణీ చేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు



పలమనేరులో మాట్లాడుతున్న అమాస రాజశేఖర్‌రెడ్డి

కుప్పం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కష్టజీవులకు ఎల్లప్పుడూ అండగా నిలబడుతారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పంలో శనివారం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్లకు అండగా పథకాన్ని వారు ఘనంగా ప్రారంభించారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేశారు. అంతకుముందు స్థానిక కుప్పం చెరువుకట్టనుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కిందన్నారు. అదే సమయంలో ఆటో డ్రైవర్లు నష్టపోకుండా వారికి ఏటా రూ.15 వేల చొప్పున నగదు వారి ఖాతాల్లో జమ చేయడం కష్టజీవులపై ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో కడా పీడీ వికాస్ మర్మత్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కన్నన్, కౌన్సిలర్ జిమ్ దాము, ఇతర కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** ఆటో సేవా పథకంతో ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తోందని డీసీసీ బ్యాంకు చైర్మన్ చైర్మెన్ అమాసరాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పలమనేరులోని మార్కెట్‌యార్డు వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఆటో ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● **పుంగనూరు:** అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం సాయం అందుతుందని రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. శనివారం పుంగనూరులో ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. పుంగనూరులో మినీ స్టేడియం ఏర్పాటు చేయడానికి తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఆటో డ్రైవర్లకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రవికుమార్, పుంగనూరు, సోమల ఏఎంసీ చైర్మన్లు శమిపతి, శ్రీనివాసులునాయుడు, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీఏ సుప్రియ, కూటమి నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, శ్రీకాంత్, దినేశ్, జగదీష్‌రాజు, ఇబ్రహీం, వెంకటరెడ్డి, రెడ్డెప్పనాయుడు, నరేశ్‌రాయల్, గంగాధర్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

● **గంగవరం:** ఇచ్చిన హామీలతో పాటు మరెన్నో పథకాలను తీసుకొస్తూ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం గంగవరంలో ఆటోడ్రైవర్ల ర్యాలీ అనంతరం స్థానిక మదర్‌థెరీసా కళాశాలలో ఆటో డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఎంపీఏ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజన్న, ఆర్.వి.బాలాజీ, రంగనాథ్, కిషోర్‌గౌడ్, ఆనంద, నాగరాజరెడ్డి, ఆర్‌బీసీ కుట్టి, సుబ్రహ్మణ్యం గౌడు, ఖాజా, నాగరాజులతోపాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మురుగునీటికి స్థానచలనం



పొంగి ప్రవహిస్తున్న కౌండిన్య రిజర్వాయర్



రిజర్వాయర్ వద్ద యువత సందడి



రిజర్వాయర్ నుంచి ప్రవహిస్తున్న మురుగునీరు

పలమనేరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు దాహార్తి తీర్చేందుకు నిర్మించిన కౌండిన్య రిజర్వాయర్‌లో ఇప్పటి వరకు నిండిఉన్న మురుగు నీటికి స్థానచలనం కలిగింది. గత నెల రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలమనేరు పెద్దచెరువు నిండిన సమయంలో ఆక్రమణదారులు చెరువుకట్టకు గండికొట్టడంతో చెరువులోని నీరు సగం కలుజు కాలువ నుంచి కౌండిన్యనదికి చేరుకున్నాయి. దీంతో అసలే మురుగునీటితో ఉన్న పలమనేరు పెద్దచెరువు నీరు రిజర్వాయర్‌కు చేరి నల్లగా స్పష్టంగా కనిపించేది. అలాంటి మురుగునీటితో కౌండిన్య రిజర్వాయర్ వారం రోజుల క్రితమే నిండింది. అయితే మళ్లీ వర్షాలు బాగా కురిసి కౌండిన్యనది ఉధృతంగా పారితే గాని రిజర్వాయర్‌లోని మురుగునీరు వెలుపలికి వెళ్లదని.. అంతవరకు ఆ మురుగునీరు ప్రజలకు తాగేందుకు సరఫరా చేయడం కుదరదని అధికారులు వేచిచూస్తున్నారు. అయితే శుక్రవారం అర్ధరాత్రి నుంచి పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల్లో భారీగా వర్షం కురిసింది. దీంతో ఈ మండలాల్లోని చెరువుల కలుజు పారి కౌండిన్య నది ఉధృతంగా సాగింది.

దీంతో శనివారం ఉదయం నుంచే కౌండిన్య రిజర్వాయర్ పొంగి ప్రవహిస్తోంది. ఇలా ప్రవహిస్తున్న నీరు మురు గు నీటిని తలపిస్తోంది. నిల్వఉన్న మురుగునీరు దిగువకు తరలిపోతోందని .. దీంతో రిజర్వాయర్‌లోకి ఇక కౌండిన్య నది నుంచి మంచినీరు చేరుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోండి



ఓపెన్ స్కూల్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంఈవోలు

కల్లూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్స్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ పదో తరగతిలో చేరే విద్యార్థులు 14 సంవత్సరాలు నిండినవారై ఉండాలని, ఇంటర్మీడియట్‌లో చేరే విద్యార్థులు పదో తరగతి పాసై 15 సంవత్సరాలు నిండినవారై ఉండాలన్నారు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఎంఈవో కార్యాలయంలోని పనివేళల్లో సంప్రదించాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కళామందిరంలో సంగీత కచేరి

గంగవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగీత కచేరి, ఉపాధ్యాయులకు పురస్కారాల పంపిణీ చేపట్టనున్నట్లు నిర్వాహకులు, ధనంజయ, తులసీనాథం నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

యువకుడి అదృశ్యం

పుంగనూరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు శనివారం పుంగనూరు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం అరికెల పంచాయతీ గోసువారిపల్లెకు చెందిన రెడ్డెప్పరెడ్డి కుమారుడు సంతోష్‌రెడ్డి (26) గతనెల 29వ తేదీన పుంగనూరు వెళుతున్నట్లు చెప్పి వచ్చినట్లు యువకుడి తండ్రి ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ



వెంకటేష్‌కు వీల్‌చైర్‌ను అందజేస్తున్న ఆశాజ్యోతి సంస్థ సభ్యులు

పలమనేరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం కొలమాసనపల్లి పంచాయితీ దొడ్డిపల్లి యానాది కాలనీలో నివాసముంటున్న దివ్యాంగుడు వెంకటేష్ (14)కు శనివారం ఆశాజ్యోతి సేవా సంస్థ సభ్యులు వీల్‌చైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు జి.రామానాయుడు, సెక్రటరీ టి.రమేష్, కోశాధికారి ఎం.హరికృష్ణ, సభ్యులు గోవిందు, దొరబాబు, కనకమ్మ, భాగ్యలక్ష్మి, భూలక్ష్మి, వేణుగోపాల్, వెంకటమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం సాధ్యం



మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

చౌడేపల్లె, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. శనివారం ఆయన చౌడేపల్లెలో పర్యటించి విలేకర్లతో మాట్లాడారు. నవ్యాంధ్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వంలోనే సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. పీఎం మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో దేశంతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆటో సోదరుల ఆర్థికాభివృద్ధి కోసం రూ.15 వేలు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో చౌడేపల్లె, పుంగనూరు మండలా టీడీపీ అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, మాధవరెడ్డి, నాయకులు కల్యాణ్, మహ్మద్ గని, అమీద్‌ఖాన్, రమణ, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

● **సోమల:** సోమల ఏఎంసీ యార్డును శాప్ చైర్మన్ రవినాయుడు శనివారం సందర్శించారు. స్థానిక టీడీపీ నాయకులతో ముచ్చటించారు. మండలంలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, చెన్నపట్నం చెరువు నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్, మాజీ నీటి సంఘ అధ్యక్షుడు కోటీశ్వరరావు, పీఎం.చంద్రశేఖర్ నాయుడు, సతీశ్, శ్రీనివాసులు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులకు 'రోసా' సహకారం



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు

రొంపిచెర్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 20 మంది విద్యార్థులకు శనివారం రొంపిచెర్ల పూర్వవిద్యార్థుల అసోసియేషన్ (రోసా) అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.1,24,000 ఉపకార వేతనాలు స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో అందించారు. దాతలు రవీంద్రనాథరెడ్డి రూ.5 వేలు, పకర దీప్‌కుమార్ రూ. 20 వేలు, గోపాలకృష్ణ రూ.5 వేలు, శ్రీహరిప్రసాద్ రూ.5 వేలు, రోసా ఖాతా మొత్తంలో రూ.89 వేలు కలిపి రూ.1,24,000 పంపిణీ చేశామని రోసా అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రఫీబాషా, రోసా సభ్యులు వెంకట్రమణారెడ్డి, నరసింహులు, మునిరాజ, సుధాకర్‌రెడ్డి, జాఫర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు



సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

చౌడేపల్లె, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్య సాయి బాబా శత జయంతి వేడుకలను సత్య సాయి భగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక సత్య సాయి మందిర్‌లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చౌడేపల్లె, సోమల, పుంగనూరు మండలాల్లో 100 మందికి రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు సుజాత, హేమలత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు తిరుత్తణిలో గిరి ప్రదక్షిణ

సోమల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమల-తిరుపతి మార్గంలోని బంగారు తిరుత్తణి లో శనివారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం భారీ వర్షంతో ఇబ్బంది పడ్డారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అభిషేక పూజలు చేపట్టారు. భజన మండలి సభ్యులు సంకీర్తనలు, భజనలు చేశారు. కార్యక్రమంలో సోమల, కరకమంద, నడింపల్లె, దాసరివారిపల్లె, గన్నావారిపల్లె భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి



చదువు ప్రాముఖ్యతను వివరిస్తున్న ఉపాధ్యాయులు

కుప్పం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని కుప్పం మండలం అడవిబూదుగూరు గ్రా మం యానాదిపురం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల సీఆర్పీ ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి అన్నారు. యానాదిపురం కాలనీలో ఆయన శనివారం ఇంటింటా సర్వే నిర్వహించారు. పిల్లలను పనికి పంపడం నేరమన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను బడికి పంపి చదివిస్తే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రోత్సహించారు. సీఆర్పీ జాయింట్ సెక్రటరీ చిట్టిబాబు, సీఆర్ఎంటీ వెంకట్రాయశెట్టి, ఉపాధ్యాయులు లోకనాథం, అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

సమయపురికి గంగమ్మ భక్తుల పయనం



సమయపురి పుణ్యక్షేత్రానికి బయలుదేరిన భక్తులు

పలమనేరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు గంటావూరు కాలనీలోని గంగమ్మ గుడి గౌరవ అధ్యక్షులు మురుగన్ ఆధ్వర్యంలో 140 మంది గంగమ్మ మాల ధరించిన భక్తులు శనివారం తమిళనాడులోని సమయపురి మారెమ్మను దర్శించుకునేందుకు బయలుదేరి వెళ్లారు. అంతకుముందు గంగమ్మ గుడిలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

మాధవరం వంకను పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టరు



మాధవరం వంక వద్ద గ్రామస్తులు, రైతులతో మాట్లాడుతున్న నరేంద్ర

తవణంపల్లె, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తున్న మాధవరం వంకను అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర శనివారం పరిశీలించారు. గ్రామస్తులు, రైతులతో మాట్లాడి నష్టపోయిన పంటల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అలాగే గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు తొడతర, గాజులపల్లె వద్ద కొట్టుకుపోయిన బ్రిడ్జిలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. శనివారం రాత్రి కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వంక సమీపంలోని గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తహసీల్దార్ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుశస్థలీ నది వద్ద రెడ్ అలర్ట్

నగరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ సమీపంలో కుశస్థలీనది వద్ద రెవెన్యూ అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. కృష్ణాపురం డ్యాం పూర్తిగా నిండిపోవడంతో శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో డ్యాం గేట్లు తెరవడంతో ఈ హెచ్చరిక చేశారు. సత్రవాడ వద్ద జయశంకర్ (సెల్ నెంబరు: 90002 99091), తెరణి వద్ద వెంకటపతి (సెల్ నెంబరు: 63053 12141, ఏకాంబరకుప్పం వద్ద కేశవులు (సెల్ నెంబరు: 99517 77547, నగరి వద్ద ప్రభాకర్ (సెల్ నెంబరు: 97046 23597), కీళపట్టు వద్ద పూర్ణచంద్ర (సెల్ నెంబరు: 81793 79712)ను ఏదైనా ప్రమాదం జరిగితే తెలియజేయాలని సంబంధిత వీఆర్వోలు అక్కడ అందుబాటులో ఉంటారని తహసీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నగరిలోని రోడ్లపై నిలిచిన వర్షపునీరు



నగరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో శనివారం ఉదయం కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. మరోవైపు కాలువల నుంచి మురుగు రోడ్లపైకి ప్రవహించింది. దీనివల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

ఆటో డ్రైవర్లకు సన్మానం



ఆటో డ్రైవర్లతో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సన్మానించారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.15వేలను ఇస్తామని చెప్పిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని ప్రశంసించారు. చంద్రబాబు పాలనలో అన్నివర్గాల ప్రజలు సుఖ, సంతోషాలతో ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా సీఎంకు, ఎమ్మెల్యేకు ఆటో డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, పార్టీ నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, నరేష్, లీలావతి, శరత్, పచ్చప్ప, ఉదయ్ కుమార్, దితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ నేతల ధ్యేయం

● రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్



గంగాధరనెల్లూరులో ఆటోడ్రైవర్లు, టీడీపీ నేతలతో కలిసి ర్యాలీ చేస్తున్న థామస్

గంగాధరనెల్లూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): 'ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ నేతల ధ్యేయం. దీనికోసం సొంత డబ్బు కూడా ఖర్చు పెడతారు. అంతేతప్ప సొంతంగా లబ్ధి పొందే ఉద్దేశం ఉండదు' అని ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. 'ఆటో డ్రైవర్ సేవలో..' భాగంగా శనివారం ఆరు మండలాల ఆటోడ్రైవర్లు, నేతలు, అధికారులతో కలిసి గంగాధరనెల్లూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్ కొద్ది దూరం ఆటో నడిపారు. అనంతరం ఎంపీడీవో ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందన్నారు. దీనివల్ల ఆటోడ్రైవర్లకు ఆదాయం తగ్గిందని గుర్తించడంతో వారికి ప్రతి ఏడాదీ రూ.15వేల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలో 936 మందికి రూ.1.40కోట్ల నిధులను ఆటో డ్రైవర్ల బ్యాంకు ఖాతాలకు జమచేయనున్నట్లు తెలిపారు. పెనుమూరు ఏఎంసీ ఛైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, సింగిల్‌విండో ఛైర్మన్ మోహన్‌నాయుడు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ అరుల్‌నాథన్, టీడీపీ అధ్యక్షులు స్వామిదాస్, చెంగల్రాయయాదవ్, రుద్రయ్యనాయుడు, జయశంకర్‌నాయుడు, నాయకులు కార్జాల అరుణ, దేవపత్ని ధనంజయనాయుడు, ఇందిరమ్మ, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు షణ్ముగం కృతజ్ఞతలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తోటపాళ్యంలోని 25 మంది రజకులకు తోపుడు ఇస్త్రీ బండ్లను ఉచితంగా ఇచ్చిన ఎమ్మెల్యే జగన్మోహన్‌కు టౌన్‌బ్యాంక్ మాజీచైర్మన్‌షణ్ముగం కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యేను స్వగృహంలో కలిసి సన్మానించారు.

గ్రామసభ

విజయపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో అభివృద్ధి పనులు గుర్తించడంపై శనివారం బూచివానత్తంలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ గోపాల్, టీడీపీ నాయకులు మురళి, శ్రీనివాసులునాయుడు,బాబు,ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.



వర్షానికి కారుతున్న పైకప్పు





వార్డు బయట ఆరబెట్టిన బెడ్లు - పైకప్పు దెబ్బతిని బయటకు కనిపిస్తున్న కమ్మీలు



రోగి మంచం పక్కనే పడ్డ పైకప్పు పెచ్చులు

కుష్ఠు రోగులంటే ఎందుకంత నిర్లక్ష్యం?

చిత్తూరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు రోగులంటే ఎందుకంత నిర్లక్ష్యమన్న ప్రశ్న తలెత్తుతోంది. కూలడానికి సిద్ధంగా ఉన్న భవనంలో వీరికి వైద్యసేవలు అందించడం చూస్తుంటే అది నిజమేననిపిస్తుంది. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో కుష్ఠు రోగుల వార్డును ఏర్పాటు చేసిన భవనం చాలా ఏళ్ల కిందట నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరుకుని.. స్లాబ్‌లో పెచ్చులూడుతోంది. వర్షం వచ్చినప్పుడల్లా ఉరుస్తూ.. వార్డు మొత్తం నీటితో నిండిపోతుంది. రోగులు రాత్రంతా జాగరణ చేయాల్సి వస్తోంది. ఈ సమయంలో ఫ్యాను, లైట్లు వేస్తుంటే కరెంటు షాక్ కొడుతోందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వార్డులో సుమారు 15 మంది వరకు చికిత్స పొందుతున్నారు. వీరంతా నిరుపేదలే కావడంతో అధికారులు కూడా పట్టించుకోవడం లేదని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలోనే ఈ భవనాన్ని తొలగించి, నూతనంగా నిర్మించాలని భావించారు. ఎందుకనో పేపర్ దశలోనే ఆ నిర్ణయం ఆగిపోయింది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి నూతన భవనం నిర్మించాలని రోగులు కోరుతున్నారు.

ప్రాణాలు పోయేలా ఉన్నాయి

చికిత్స కోసం ఆస్పత్రికి వస్తే ఈ భవనం పరిస్థితి చూస్తుంటే మా ప్రాణాలు పోయేలా ఉన్నాయి. వర్షం వస్తే భవనం మొత్తం కారతాఉంది. బెడ్లన్నీ తడిచిపోతున్నాయి. పైకప్పు ఊడి మామీదే పడతా ఉంది.

- లలితమ్మ, రోగి

రాత్రంతా నిద్ర ఉండటం లేదు

వర్షానికి భవనం ఉరుస్తుండటంతో రాత్రంతా నిద్ర ఉండటం లేదు. మంచం మొత్తం తడిచిపోతోంది. బెడ్లు ఆరబెట్టుకొని, నేలంతా తుడుచుకుంటూ జాగారం చేస్తున్నాం.

- కృష్ణయ్య, రోగి





పాతపాళ్యం దళితవాడవద్ద మొరవ పారుతున్న తూగుండ్రం చెరువు - ఎల్లాపల్లె వద్ద రోడ్డుపైకొచ్చిన నీటి ప్రవాహం



బొమ్మవారిపల్లె వద్ద నీటితో కళకళలాడుతున్న వంక

గంగాధరనెల్లూరులో భారీ వర్షం

మొరవలు పారిన చెరువులు ● ఇబ్బందిపడ్డ జనం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 82.6 మిల్లీమీటర్ల భారీ వర్షం కురిసింది. తూగుండ్రం ఫకీర్‌తోట వద్ద, అలాగే పాతపాళ్యం దళితవాడ వద్ద, తూగుండ్రం పీహెచ్‌సీ నుంచి వేణుగోపాలపురం మధ్యలో తారురోడ్డుపై చెరువు మొరవనీళ్లు పారుతోంది. అలాగే కొత్తవెంకటాపురం, గరిగలపల్లె చెరువు బొజ్జనాయనిపల్లె దళితవాడ వద్ద, ఎల్లాపల్లె చెరువులు మొరవలు పారుతున్నాయి. ఎల్లాపల్లె వద్ద నడిరోడ్డుపై చెరువు మొరవనీళ్లు సాగడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దాటడానికి జనం భయపడ్డారు. కలిజవేడు పంచాయతీ బొమ్మవారిపల్లె వంక జోరుగా సాగడంతో కార్లు, ద్విచక్రవాహనదారులు మరో మార్గంలో గంగాధరనెల్లూరుకు, చిత్తూరు నగరానికి రాకపోకలు సాగించారు.



బొజ్జనాయనిపల్లె దళితవాడ వద్ద మొరవ పారుతున్న గరిగలపల్లె చెరువు

అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీవారే నిప్పు పెట్టారు!

● రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ ఆరోపణ

గంగాధరనెల్లూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీవారే నిప్పు పెట్టేసి నాటకాలు ఆడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్ ఆరోపించారు. గంగాధరనెల్లూరులో శనివారం ఆటో డ్రైవర్లకు మెగా చెక్ పంపిణీ చేశాక ఆయన ప్రసంగించారు. వైసీపీ తరపున గంగాధరనెల్లూరు నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, డిప్యూటీ సీఎం హోదాలో కొనసాగిన నారాయణస్వామి వల్ల నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఇపుడేమో కులాలమధ్య చిచ్చు పెట్టి.. పైశాచిక ఆనందం పొందుతున్నారని ధ్వజమెత్తారు. ఇక వైసీపీ వారు ఎస్సీలకు చేసిందేమీ లేదని చెప్పారు.

'పెరటాసి' మూడో శనివారం పూజలు

నగరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పెరటాసి నెల మూడో శనివారం సందర్భంగా పట్టణ పరిధిలోని భూదేవి, శ్రీదేవి సమేత కరియమాణిక్యస్వామి, భూనీలా సమేత కరివరదరాజ స్వామి ఆలయాల్లో పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కరియమాణిక్యస్వామి ఆలయంలో సాయంత్రం నిర్వహించిన ఊంజల్‌సేవ నేత్రపర్వంగా సాగింది. భక్తులకు ఏర్పాట్లను ఆలయ అధికారి వెంకటరమణ పర్యవేక్షించారు. పాదయాత్ర చేసే గోవింద భక్తులకు ప్రకాశం, బైపాస్ రోడ్ల వద్ద, ఆలయాల వద్ద పలువురు దాతలు అన్నదానం చేశారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గీతా కడబ శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నీటి సమస్యకు పరిష్కారం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ కృషితో తూగుండ్రం పీహెచ్‌సీలో కొత్తగా బోరుడ్రిల్లింగ్ చేసి నీటిసమస్యను పరిష్కరించారు. కొన్నిరోజులుగా ఇక్కడ నీటిసమస్య ఉందని టీడీపీనేతలు థామస్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి కొత్త బోరు వేయించాలని ఆదేశించారు. దాంతో శనివారం కొత్తబోరు డ్రిల్లింగ్‌కు టీడీపీనేతలు పూజలు చేసి, ప్రారంభించారు. తూగుండ్రం సర్పంచ్ శ్రీబాబు, టీడీపీ నాయకులు జీవరత్నం, నరసింహులునాయుడు, అత్తేహర్ అల్లీ, సంపత్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పూతలపట్టు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. పి.కొత్తకోట పంచాయతీ మన్నార్‌పల్లె దళితవాడలో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు గ్రామాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేశారన్నారు. అనంతరం గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయం వద్దకు చేరుకుని గరుడసేవలో పాల్గొన్నారు. అలాగే వసంతాపురంలోని శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి, నాయకులు ప్రతాప్‌నేని చంద్రమౌళి, బాబురావు, మురళీనాయుడు, నేతాజీ, మునస్వామి, హరి, రమేష్, చింటూ, కన్నయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి చంద్రబాబు కృషి

● ఎమ్మెల్యే మురళీ మోహన్



ఆటో డ్రైవర్లకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

పూతలపట్టు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మురళీ మోహన్ చెప్పారు. శనివారం పూతలపట్టులో జరిగిన 'ఆటో డ్రైవర్ సేవలో..' ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల యోగక్షేమాలను, జీవన పరిస్థితులను గుర్తించి వారి జీవితాల్లో ఆనందం నింపడానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. నియోజకవర్గంలో రూ.1.61కోట్లను డ్రైవర్ల ఖాతాల్లోకి జమ చేశామని తెలిపారు. అనంతరం పూలపట్టు నుంచి రంగంపేట క్రాస్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూడా ఆటో నడిపాడు. పూతలపట్టు, బంగారుపాళ్యం, యాదమరి, తవణంపల్లె, ఐరాల మండలాల అధ్యక్షులు దొరబాబు చౌదరి, ధనంజయనాయుడు, మురార్జీ యాదవ్, వెంకటేశ్వర చౌదరి, గంగారపు హరి, నేతలు బాబురావు, ప్రతాప్‌నేని చంద్రమౌళి, అమరనాథనాయుడు, చిరంజీవి, జగన్నాధం, గుంటూరు మురళీ, మండల బీజేపీ అధ్యక్షులు ప్రసాద్, హరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



కోదండరాముడి మృతదేహం

బంగారుపాళ్యం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. పాలసముద్రం మండలం ఆముదాల గ్రామానికి చెందిన రామచంద్రశెట్టి కుమారుడు కోదండరాముడు(45) బెంగళూరుకు తన ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. శుక్రవారం రాత్రి తంబుగానిపల్లె రెడ్డి డాబా వద్ద ఉన్న సర్వీసు రోడ్డులోకి వచ్చేసరికి అక్కడున్న డివైడర్‌ను ప్రమాదవశాత్తూ ఢీకొన్నాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జరిమానా

చిత్తూరు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందికి జరిమానా విధించారు. ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు.. రెండ్రోజులుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. 13 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడగా వారిపై కేసు నమోదు చేశారు. నిందితులను శనివారం కోర్టు ముందు హాజరుపరిచారు. జడ్జి ఉమాదేవి.. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

సంక్షిప్తంగా..

దుస్తుల వితరణ



చిత్తూరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ గృహంలో నిరాశ్రయుల అనాథలకు నగరానికి చెందిన మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు శనివారం చీరలు, లుంగీలు, దుప్పట్లు వితరణ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

భక్తులకు అన్నదానం



వెదురుకుప్పం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం భక్తులకు పుత్తూరుకు చెందిన మురళీధర్‌రెడ్డి, శిరీషాదేవి వితరణతో అన్నదానం చేశారు. ఈ మేరకు ఆలయ ఇన్‌స్పెక్టరు గోపాలం సురేష్‌కుమార్ తెలిపారు.

ప్రదోష కాల పూజలు

వెదురుకుప్పం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సమీపంలోని శిష్ట సౌందర్యవల్లి సదాశివస్వామి ఆలయంలో శనివారం ప్రదోష కాల పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నాకు సన్మానం



వెదురుకుప్పం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, గుంటూరు జిల్లా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణను శనివారం కార్వేటినగరం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ రామిశెట్టి రాజశేఖర్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు.

కేంద్రమంత్రిని కలిసిన మాల కార్పొరేషన్ డైరెక్టర్



వెదురుకుప్పం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాంఘిక, న్యాయ, సాధికార శాఖ మంత్రి రాందాస్ అథావాలేని శనివారం రాత్రి తిరుపతిలోని రాజ్ హోటల్‌లో జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి, ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న కలిశారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రిని సత్కరించారు.

ఆటో డ్రైవర్లకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. 'ఆటో డ్రైవర్ సేవలో..' భాగంగా శనివారం నగరి పట్టణ పరిధిలోని టవర్‌క్లాక్ నుంచి ఆటోడ్రైవర్లు తమ ఆటోలతో ర్యాలీగా ఏజే కల్యాణ మండపం వద్దకొచ్చారు. ఎమ్మెల్యే కూడా ఆటో ఎక్కి వేదిక వద్దకొచ్చారు. అక్కడ జరిగిన సమావేశంలో భానుప్రకాష్ ప్రసంగించారు. నగరి నియోజకవర్గంలో 718 మంది ఆటోడ్రైవర్లకు రూ.కోటి 7 లక్షల 70 వేల ఆర్థిక సాయం అందించడం జరిగిందని చెప్పారు. అనంతరం మెగా చెక్కును ఆటో డ్రైవర్లకు అందించారు. సమావేశం జరుగుతుండగానే తమ బ్యాంకు ఖాతాలకు రూ.15వేలు జమైనట్లు సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు రావడాన్ని ఆటోడ్రైవర్లు గమనించి ఎమ్మెల్యేకి చూపించి ఆనందం వ్యక్తం చేశారు. ఎంపీఐ వాసుదేవరెడ్డి, డీపీవో సుధాకరరావు, కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో వాణి, టీడీపీ నాయకులు గుణశేఖర్, బాలాజీ, ధనంజయలునాయుడు, జవహర్‌రెడ్డి, శివ, మీర, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్